
# కాలేజీకీ కహానీ

## — డాక్టర్ సోమిరెడ్డి (పెళ్లకూరు) జయప్రద



మీతో మాట్లాడాలి; కబ్బన్ పార్క్ కెళ్దాం వస్తారా?

మస్టర్డ్ కలర్ చుడీదార్‌లో చేతిలో పుస్తకాలతో అంబేద్కర్ కాలేజీ పరిసరాలలో నడుస్తున్న హారిణి తలెత్తి చూసింది. తనతో చదువుతున్న సహ ఆంధ్రుడు విరించి ఆమె కళ్ళల్లోకి చూస్తున్నాడు ఆ చూపు క్రొత్తగా వుంది. ఆమె గుండె గొంతులో కొచ్చి యథాస్థానంలో కెళ్ళిన అనుభూతి ఆమెనుక్షణంలో చుట్టేసింది. తల విదిలించుకుంది. కానీ ఆమె పందొమ్మిదేళ్ళ వయస్సు ఇంకా కంపిస్తూనే వుంది. ఆంధ్రేతర రాష్ట్రంలో పరాయి భాషా భేదాల మధ్య వుంటున్న వారిద్దరికీ ఇది తొలి పరిచయం ఏమీ కాదు. పైగా ఒకే రాష్ట్రం వారు కావడంతో సంవత్సరం రోజులుగా ఆ మెడికల్ కాలేజీలో ఒకరి భావావేశాల్ని మరొకరు పంచుకుంటూనే వున్నారు. బహువచన ప్రయోగం దశలోనే వున్న స్నేహితులు వారు.



"మీతో ముఖ్య విషయం మాట్లాడాలి. ఓ పది నిముషాలు అంతే. కబ్బన్ పార్క్‌కి వెళ్దాం వస్తారా?" మరోమారు అడిగాడు విరించి.

మళ్ళీ ఆమె గుండెల్లో ఏదో సందడి. ఒక అబ్బాయి- అందునా సంవత్సరం నుంచి పరిచయం వున్న వాడు మీతో మాట్లాడాలి అనగానే ఏవిటీ వెధవ ఎక్సైట్‌మెంట్?

తనని తాను విసుక్కుని ఆలోచనల నుండి తేరుకుని కళ్ళెత్తి సూటిగా అతని కళ్ళల్లోకి చూసింది హారిణి.

"చెప్పండి. ఇక్కడే చెప్పండి."

"ఇక్కడా?" అతను తటపటాయించాడు.

"ఇక్కడ బాగుండదు" తిరిగి అన్నాడతడు.

"మీరు నాతో చెప్పాలనుకున్నది ఒక విషయం. ఎక్కడ చెప్పినా అదే విషయం- ఇక్కడ చెప్తే ఎందుకు బాగుండదు?"

ఈసారి అతను తడబడ్డాడు.

"బాగుండదంటే నా ఉద్దేశం ఈ పరిసరాలు అవీ..."

స్వచ్ఛంగా నవ్వింది హారిణి.

"మనం తిరిగే పరిసరాలివి. ఇక్కడ మాట్లాడితే ఎవరికీ మరో దురాలోచన రాదు. మరోచోట మనల్ని చూస్తే మరోలా అనుకుంటారు. యిక్కడే చెప్పండి."

అతను ప్రీగా నవ్వాడు.

"ఇలాగేనా? ఐ మీన్ నిల్చునేనా?"

"ఆ పది నిముషాలేగా మీరు మాట్లాడాలన్నది. నాకు కాళ్ళు నొప్పులు లేవు. పది నిముషాలు నా శరీరాన్ని అవి భరించగలవు. మీ కాళ్ళ కలసటయితే చెప్పండి కూర్చుందాం"- ఆమె ఎంత అదుపులో పెట్టుకుంటున్నా ఆమె గుండె స్పందిస్తూనే వుంది.

ఆమె మాటల్లో కవ్వింపు దొర్లనే దొర్లింది. ఇరవై, ఇరవై రెండేళ్ళ ఓ అబ్బాయి అదే వయస్సున్న ఇష్టమైన ఓ అమ్మాయితో ఏం చెప్పాలనుకుంటున్నాడో తెలుసుకోలేనంత అమాయకురాలేం కాదు హారిణి.

"నా కాళ్ళు నాతో సహకరించడం లేదు. మీరూ కూర్చుంటారనుకుంటాను" అతను కూర్చుంటూ తలెత్తి అన్నాడు.

ఆమె క్షణం తటపటాయించింది. అతను కూర్చున్న పచ్చిక వైపు చూసింది. చప్పున అతను సైడ్ ప్యాకెట్‌లో నుండి కర్చీఫ్ తీసి పరిచి కూర్చోమన్నట్టు ఆమె వైపు చూశాడు.

"థాంక్స్" ఆమె కర్చీఫ్ తీసి మడిచి అతనికిచ్చి బాగా దూరంగా అతని ఎదురుగా పుస్తకాలు ముందు పెట్టుకుని కూర్చుంది.

ఓ ఐదు నిముషాల నిశ్శబ్దం తర్వాత ఎదురుగా కూర్చున్న తన స్నేహితురాలు తన చిన్న బ్లాక్ డయిల్ వున్న రిస్ట్ వాచ్ వైపు చూసుకున్నాక ఎలాటి ఉపోద్ఘాతం లేకుండా కొద్దిపాటి తడబాటుతో అన్నాడు విరించి-

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. నన్ను మీరు ప్రేమిస్తున్నారో లేదో గానీ"

ఆమె ఎదురు చూస్తున్న ప్రశ్నే అది. అభ్యర్థనే అది. అయినా ఏదో కొత్త మాట విన్నట్టుగా, కొత్త జీవితం దొరికినట్టుగా, అంతవరకు ఎండిపోయిన పచ్చిక పచ్చగా వున్నట్టుగా, ఉక్కగా వున్న వాతావరణం చల్లగా మారినట్టుగా ఏదో కొత్తదనం వద్దనుకుంటూనే తను కోరుకుంటున్న కొత్తదనం తీనికి తోడు శరీరమంతా ఏదో తీయదనం.

"హారిణి గారూ! ఏం మాట్లాడరు?"

"ఏం మాట్లాడేది?" సన్నగా గొణిగింది హారి.

"ఏదైనా... ఏదైనా సరే మీ మనస్సులో వుండేది, మీ జీవితానికి బావుంటుందనుకున్నది"

ఇరవై రెండేళ్ళ ఆ కుర్రాడు జీవితం గురించి ఆలోచిస్తున్నాడు. జీవితం గురించి ఏమీ తెలియని అతను అంతా తెలుసుననుకుని తన నిర్ణయాలు తనే చేసుకుంటున్నాడు. అంతే కాకుండా తన స్నేహితురాల్ని కూడా నిర్ణయం తీసేసుకోమని తొందర పెడ్తున్నాడు. తను తీసుకున్న నిర్ణయం నూటికి నూరుపాళ్లు సవ్యమైందనే ధీమాతో మాట్లాడుతున్నాడు.

"ప్లీజ్ అలా మౌనంగా వుండకండి. మీ నెగటివ్ ఆన్సర్‌కి తట్టుకోలేననిపిస్తోంది."

**హారిణి పేర్చుకుంటున్న వాక్యాల తోరణం పుటుక్కున తెగిపోయింది. ఒక అందమైన అబ్బాయి నోటి వెంట నువ్వు నన్ను కాదంటే నేను భరించలేననే భాష ఎంత తీయగా వుంటుందో టీనేజ్ ఆడపిల్లకు!**

"ఊ! చెప్పండి. మీ మనసులోది చెప్పేయండి. నెల రోజులుగా మీ మీద నాకీ అభిప్రాయం ఏర్పడినప్పటి నుండీ నేననుభవిస్తున్న టెన్షన్‌ని ఇక నేను భరించలేను. పైగా చదువు కూడా పాడైపోతోంది"

వాలిపోయిన కనురెప్పల్ని బలవంతంగా పైకి లేపింది హారిణి. ఇంకా బలవంతంగా నోరు విప్పబోయింది. ఆమె పెదాలు తడబడ్డాయి.

అతను ఆమె వైపు ఆరాధనగా చూస్తూ నిశ్శబ్దంగా మిగిలిపోయాడు.

'ఈ అమ్మాయి 'ఊ' అంటే తనెంత అదృష్టవంతుడు!'

నిజానికి ఆ అమ్మాయి గురించి విరించికి తెలిసింది చాలా తక్కువ. పుస్తకాల భాష తప్ప మరే భాష వారిద్దరి మధ్య ఇంతవరకూ దొర్లలేదు. వాళ్ళ వాళ్ళ ఫామిలీ బ్యాగ్రౌండ్స్ ఏమిటో కూడా ఇద్దరికీ స్పష్టంగా తెలీదు.

ఐదునిముషాల్లో తనని తాను దృఢ పర్చుకుంది హారిణి.

"మీరు... మీరు నా జీవితానికి ఏది బాగుంటుందో ఆ నిర్ణయం తీసుకోమన్నారు. కానీ విరించి గారూ! నా మనస్సు ఈ క్షణంలో ఏది ఆలోచించినా అది తెలివిగా వుండదని నా కన్పిస్తోంది."

"అంటే... మీ మనస్సు బాగోలేదా? నా మాటలు మిమ్మల్నేమయినా నొప్పించాయా?..."

ఆమె అతన్ని మధ్యలోనే ఆపేసింది.

"ప్లీజ్! మీరేం మాట్లాడకండి. ఇప్పటికే మీ మాటల వల్ల నా అందం గర్వపడింది. నా ఆనందం రెట్టింపయింది. నా మేధస్సు మందగించింది. చెప్పండి. ఇప్పుడు... ఇప్పుడు ఈ మనసుతో నేనేం ఆలోచించగలను?"

అతను గుండెల నిండా గాలి పీల్చుకున్నాడు.,

"పర్వాలేదు. యు ప్లీజ్ టేక్ యువర్ ఓన్ టైమ్. సాయంత్రం కలుద్దాం" అతను లేవబోయాడు.

ఆమె చప్పున ముందుకు వంగింది. ఆమె అతని చెయ్యి పట్టుకుని అతన్ని ఆపబోయి తేరుకుని చెయ్యి వెనక్కు తీసేసుకుంది- అతను ఆడపిల్ల కాదు. నిన్నటి స్నేహితుడు కాదు- తన చేతి స్పర్శను మామూలుగా గ్రహించడానికి. తను అప్రయత్నంగా చేయబోయిన సాధారణమైన ఈ పనితో అతను తనకు కావాల్సిన జవాబును ఏరుకోవచ్చు. ఆశలు పెంచుకోవచ్చు.


ఆమె కూడా లేచింది.

"ఈవినింగ్‌కి నేను జవాబు చెప్పలేకపోవచ్చు. మీ ఇన్‌ఫ్లుయెన్స్ నా మీద తగ్గాక ఆలోచించి చెప్తాను"

"ఒ.కె., ఒ.కే... ఒ.కె. హారిణిగారూ, వస్తాను బై..."

అతను వెనక్కు తిరిగి చూస్తూ వెళ్ళిపోతున్నాడు. ఆమె పుస్తకాలు పట్టుకుని బొమ్మలా నిల్చిపోయింది. తనలోని ఈ మార్పు ఆమెను భయపెడ్తోంది.

"ఏవిటీ స్పందన? ఏవిటీ స్పందన?.... ఆమె నలిగిన చుడీదార్ చిది



లించుకుంది, మనసుని కూడా విదిలించుకుని కది లించింది. కానీ ఎమెను అతనింకా వెంటాడుతూనే వున్నాడు.

* * * *

"మీ నిర్ణయం కోసమే ఈ నిరీక్షణ..."

విరించిని చూసీ చూడనట్టే వెళ్ళబోతున్న హారిణిని మూడో మెట్టు మీదే ఆపేశాడతను.

"ఇంకా ఏ నిర్ణయానికీ రాలేదు..." గుండెల్లోని సందడిని దాచుకుంటూ అంది హారిణి.

"మీరు నన్ను ప్రేమిస్తున్నారో, లేదో తేల్చుకోవ డానికి మీకు నలభై ఎనిమిది గంటలు చాల్లేదా? నాకు నలభై ఎనిమిది గంటలు నలభై యుగాలుగా గడిచాయి."

ఆమె అగాధంలో పడిపోతూంది. ప్రేమ మైకంలోకి జారిపోతోంది. ఆమె మనసు తెర తొలిగించుకుంది-

"విరించి గారూ! ఈ నలభై ఎనిమిది గంటలూ ఆలోచించాను. నిజం విరించి గారూ! ఈ క్షణంలో కూడా ఆలోచిస్తున్నాను. మీ అభ్యర్థనను నేను హర్ట్ చేయలేదు. ప్లీజ్ నమ్మండి."

అతను వల్లబడిపోయాడు.

"అబ్బే! అదేం లేదు. మిమ్మల్ని నేనెప్పుడూ అపార్థం చేసుకోను. అలా మీరెప్పుడూ భావించకండి. కాకపోతే..." అతను ఇంకా చెప్పబోతున్నాడు. ఆమె భయపడిపోయింది. ఇప్పటికే అతని మాటలు తన మనసును లొంగదీసుకుంటున్నాయి- ఇంకా అతను మాట్లాడితే తన వివేకం దాటి పరుగున పడిపోవచ్చు- తనని బలహీనురాల్ని చేయవచ్చు- అందరి ఆడపిల్లల్లా తనూ ప్రేమ భావానికి దాసోహం అయిపోవచ్చు- ఆ ప్రమాదం రానీకూడదు.

అతనికి జవాబు చెప్పేయాలి. చెప్పిన జవాబు చెప్పి అతని ప్రభావం నుండి తను బయటపడాలి. ఆమె మాటలు పేర్చుకుంటోంది.

"పర్వాలేదు- మరో రోజు కలుద్దాం మనం. అప్పుడు చెబ్దురు గానీ..."

"ఎన్ని రోజులైనా నేనుచెప్పలేనేమోననిపిస్తోంది."

అతను ఈసారి దిగులు పడిపోయాడు.

"ఎందుకని? నన్ను మీరు ప్రేమిస్తుంటే ప్రేమి స్తున్నానని చెప్పండి. లేదా లేదని చెప్పేసేయండి. అంతే"

"అంతేనా?" బలహీనంగా అంది హారిణి.

"యా. ఇట్స్ స్ట్రెయిట్ ఫార్వర్డ్ క్వొస్చెన్. ఇది డొంక తిరుగుడు ప్రశ్న కాదు. ఏమంటారు?"

అతను స్టేర్ కేస్ రాడ్ మీద నుండి చెయ్యి తీసేసి అన్నాడు.

అది కాలేజీ అవర్ కాదు. ఇద్దరూ లైబ్రరీ కెళ్ళే ఉద్దేశంతో రావడంతో అక్కడ కలవడం సంభవించింది. విరించి అదృష్టవశాత్తూ మరే స్టూడెంటూ లైబ్రరీ వైపు రావడం లేదు.

"మీరడిగింది చాలా తేలికైన ప్రశ్నే... నిజం చెప్పమంటారా? ఇదే ప్రశ్న...:" ఆమె తల వంచు కుంది.

"ఇదే ప్రశ్న నా భర్త అడిగితే నలభై ఎనిమిది గంటలు కాదు నలభై ఎనిమిది సెంకడ్లు కూడా నా కవసరం లేదు.— ప్రేమించానని చెప్పడానికి"

విరించి తెల్ల బోయాడు. ఆమె నవ్వింది.

"అప్పుడైతే నలభై ఎనిమిది యుగాలైనా ప్రేమించుకోవడానికి అవకాశం వుంటుంది తీరిగ్గా"

"ఇప్పుడు..."

"యామ్ సారీ విరించి గారూ! క్షణంలో ప్రేమించానని చెప్పేస్తే— ఆ తర్వాత అదే మనిషిని జీవితాంతం ప్రేమించడానికి అవకాశం వుంటుందో లేదోనని..."

అతను ఫీల్ అయ్యాడు

"మీ ఉద్దేశం నాకర్థమయింది. నేనలాటి వాణ్నే కాదు. ప్రేమ వేరు, పెళ్ళి వేరు అని నేనను కోవడం లేదు, ప్లీజ్, బిలీవ్ మి"

"ప్రతి ఆడపిల్లా తనని ప్రేమిస్తున్నానన్న మగవాణ్ణే నమ్మే మోసపోతోంది. ఏమీ అనుకోవద్దు."

అతనికీసారి కొద్దిగా కోపం వచ్చింది. తన కోపాన్ని తనలోనే దాచుకునే ప్రయత్నంలో కొంత ఓడిపోయి అడిగాడు—

"మీ వయస్సెంత?"

"పంధొమ్మిది"

"ఇరవై తొమ్మిదిలా మాట్లాడుతున్నారు."

"పుస్తకాలు చదవి పదేళ్ళ ముందు కెదిగాను"

ఈ సారి శబ్దం వచ్చేలా నవ్వింది హారిణి.

"పాతికేళ్ళ ఆడపిల్లని టీనేజీలోకి క్షణంలో పంపగలిగే పుస్తకాలున్న రోజులివి"

"అలాంటి పుస్తకాలు పూర్తిగా చదవను నేను. చదివుంటే మరో పదేళ్ళ ముందుకెళ్ళుందును కానీ వెనక్కెళ్ళను. ఎందుకంటే విరించి గారూ! తెలివిగల ఆడపిల్ల అలాటి పుస్తకాలలోని ముగింపులో సహజత్వం గురించి కాస్త ఆలోచించాలి గనక"

అతనీసారి తేలిగ్గా నవ్వాడు.

"అయితే నేను ముసలమ్మను ప్రేమించానన్న మాట."

"ఎగ్జాట్లీ" పకపక నవ్వింది హారిణి.

అతను నవ్వాడు. నవ్వుతూ నవ్వుతూ ఆగాడు.

"అయితే మీరు నన్ను ప్రేమించారన్న మాట"

ఆమె నవ్వాపేసింది.

"విరించిగారు! మనం మంచి స్నేహితులం, ఓ మంచి జోక్‌కి నవ్వు కుంటున్నాం. అంతే— అంతే గానీ మీరు ఇందులో నుంచి డెరివేషన్స్ తీయకండి"

"అయితే ఈ డెరివేషన్ సాల్వ్ అయ్యే దెప్పుడు?"

"కొద్ది టైమ్ ఇవ్వండి ప్లీజ్"

"ఇంకా టైమ్ అడుగుతున్నారు మీరు. వెల్ కానివ్వండి."

"హారిణి మెట్టు ఎక్కబోయి ఆగింది.— తన స్నేహితుణ్ణి ఆశాభంగానికి వదిలేసి వెంటనే వెళ్ళి పోలేక పోయిందామె.

"మీరు బి.ఎస్‌సి. చదివి మెడిసిన్ కొచ్చారు. నేను ఒక్క సంవత్సరం ఎంట్రన్స్ కోసం నష్ట పోయాను. అంటే... అంటే మీరు నాకంటే రెండేళ్ళ పెద్ద. ఆ లెక్కన మీరు నాకు, ఆలోచించు కోడానికి రెండేళ్ళ టైమ్ ఇవ్వాలి" అతన్ని ఓదార్చే ధోరణిలో అంది హారిణి.

విరించికి ఆమె మాటలు బలాన్నిచ్చాయి.

"అయితే మీరు నన్ను రెండేళ్ళు క్షుణంగా చదివి గానీ ప్రేమించనంటారు. ఇండియన్ డేటింగ్ అన్నమాట."

"అతను జోక్ వేయాలని ఆ మాట అన్నా ఆ మాటతో క్షణంలో ఆమె ముఖం వివర్ణమయింది. స్నేహితురాలి ముఖంలో భావాల్ని అర్థం చేసుకున్న విరించి తన తప్పు తాను తెలుసుకున్నాడు.

"అయామ్ సారీ, అయాం సోసారీ హారిణి గారూ! నా ఉద్దేశం డేటింగ్ అంటే ఒకరి నొకరం..."

హారిణి కర్థమయింది. మెత్తగా నవ్వింది.

"ఇట్సాల్ రైట్ లీవిట్...కానీ..."


"చెప్పండి"

"ఒకరి కొకరం అర్థం చేసుకునే లోపల ఒక వేళ ఒకరి అభిప్రాయాలు ఒకరికి నచ్చక స్నేహితుల్లా విడి పోదామన్నా విడిపోలేనంత దుర్భర పరిస్థితిలో వుంటాం ఆ రోజు."

"అంటే"

"అంటేనా? " కాస్త సంకోచంగా చూసి అంది.

"అంటే... మన పేర్లు గోడల మీ దుంటాయి."




9-2-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

సమయానికి
మేక దొరికితే
మేక పాలు
గేదె దొరికితే
గేదె పాలు



## పోతపాలు

"తల్లి పాలు తాగి తల్లి రొమ్ము గుద్దినట్టు" ఇప్పటివరకు ఆ పార్టీలో వుండి, ఇప్పుడు ఆ పార్టీపై 'దుష్ప్రచారం' చేయడం న్యాయమా...?' ఓ రాజకీయ నాయకుడ్ని ప్రశ్నించాడు పాత్రికేయుడు.

"నేను 'పోత'పాలుతో పెరిగాను" మీసం దువ్వుకున్నాడు ఆ నాయకుడు.

— జి. సత్యం, మాచర్లపేట

---

"మీరు మరీ అతిగా ఆలోచిస్తున్నారు. ఇది ఆంధ్రా కాదు."

"కానీ నేను పద హారణాల తెలుగు బిడ్డను. తెలుగు బిడ్డగానే వుండాలనుకుంటున్నాను."

"అయితే మీ వయసిప్పుడు ముప్పైతొమ్మిదికాదు, పంథైతొమ్మిది."

"వెల్‌కమ్ ఇట్స్ గుడ్ కాంప్లిమెంట్..." "ఒకే మన పేర్లు గోడలెక్కుట్కవు. అలా ప్రవర్తిస్తాను నేను— చాలా! థ్యాంక్స్ బై, అతను చెప్పిందంతా వినేసి తను చెప్పాల్సింది మాత్రం పోస్ట్‌ఫోన్ చేసుకుని అక్కడ నుండి కదిలి అతన్ని ఆ మెట్టు మీదే వదిలేసి ఆఖరి మెట్టు దాటేసిందామె.

* * * *

రెండేళ్ళు గడచిపోయాయి. పైథాలజీ ఎగ్జామ్స్ రాసేసి తిరిగి వస్తూ వెనక్కి తిరిగి విరించిని చూసిన హారిణి ఆగి తనతో నడుస్తున్న విమలి, సిందూరలతో

"మీ రెళ్ళండి, నేను మరో పది నిముషాలల్లో వస్తాను" అని వాళ్ళను పంపేసింది—విరించి అక్కడే నిల్చున్నాడు.

అతను నడిచి తన దగ్గర కొస్తాడని ఒక్క నిముషం ఎదురు చూసిన హారిణి వెనక్కి నడిచి అతన్ని చేరుకుంది.

"రెండేళ్ళు గడచి పోయాయి." గుర్తు చేసాడు విరించి.

"హౌస్ సర్జన్ పూర్తి కావడానికింకా రెండేళ్ళుంది."

" వెల్, వుండనివ్వండి — నాక్కావల్సింది కేవలం మీ జవాబు"

"విరించీ!"

అతను ఆశ్చర్యపోయి ఆమె వైపు చూసాడు" 'గారు'తీసేసారా? మీరెప్పుడు ఆ తోకను కత్తిరిస్తారా? అని ఎదురు చూస్తున్నాను".

"నాకు రెండేళ్ళుగా అది భారంగానే వుంది గానీ దాన్ని నేను కత్తిరిస్తే మీరు దాన్నుండి మరో అర్థం తీసు కుంటారని భయపడ్డాను"

"మీరిప్పుడెందుకు తీసేసారు?" కనుబొమ లెగరేసి కళ్ళల్లో చిలిపితనాన్ని మాటల్లో దొర్లించాడు విరించి.

"ఏమో, అనుకల్పితంగా వచ్చేసింది."

అంతేనా? మరలా 'గారు' తగిలిస్తారా?"

లేదు, ఈ రెండేళ్ళుగా మారని మీ అభిప్రాయం మీద — మరలా, మరలా అడిగి నన్నిబ్బంది పెట్టని మీ మనస్తత్వం మీద నాకు గౌరవం పెరిగింది."

'గౌరవం పెరిగితే 'గారూ' తీసేస్తారా? ఎవరైనా ప్రేమ పెరిగితేనే గదా 'గారూ' తీసేసేది! మరీ పెద్ద బాల శిక్ష నేర్పాల్సినట్టుంది మీకు"

" ఏమీ కాదు" కొద్దిగా సిగ్గుపడింది హారిణి.

"ఏమీ కాదా, భలే వారే! వుండండి, మీ స్నేహితురాల్ని కనుక్కుంటాను. ఏ మండోయ్! సిందూర గారూ!"

హారిణి చప్పున అతని నోరు మూసేసింది.

అతని సర్వావయవాలు క్షణం స్తంభించి రెట్టింపు వేగంతో పనిచేయసాగాయి.

దూరంగా వెళ్ళిపోయిన సిందూరకు ఆ కేక విన్పించలేదు. విన్పించాలనీ అతను కోరుకోలేదు. అదో మైకం. అదో భావాతీత పరవశం. అంతే!

"భలే వారే! అందరికీ గానీ దండోరా వేస్తారా?"

"ఏమని? ఏమని దండోరా వేయను" ప్రియురాలి కళ్ళల్లోకి గుచ్చి గుచ్చి చూస్తూ అడిగాడు

ఆమె చప్పున కను రెప్పలు వాల్చేసుకుంది.

"ప్లీజ్ చెప్పేయండి ప్రేమించానననే ఒక్కమాట— ఒక్కమాట చాలు"

ఆమె మాట్లాడలేదు. అతనూ ఏమీ మాట్లాడలేదు, ఆమె ఏదో మాట్లాడుతూంది. మాట్లాడాల్సిన అవసరం, టైమ్ వచ్చిందని విరించికి తెలుసు.

"ప్రేమించానని చెప్పాలనే వుంది విరించీ, నా మనసుని విప్పి నీ ముందు పరవాలనీ వుంది!" ఆమెకు తెలీకుండానే ఆమె ఏకవచనంలోకెళ్ళి పోయింది.

"కానీ విరించీ, చెప్పేసిన మరుక్షణం నుండీ నామీద పెద్ద బాధ్యత వుంటుంది. దాన్ని సమంగా నెర వేర్చగలనో లేదో! అందుకే సంకోచిస్తున్నాను.రా. అలా కూర్చుందాం. ఎందుకనో ఎప్పుడూ లేదు నా కాళ్ళలో శక్తి లేన ట్టనిపిస్తోంది." ఆమె కదిలింది.

ఆకుపచ్చ పచ్చిక మీద, —ఆకుపచ్చ గార్డెన్ సిల్క్ సారీతో కళ్ళల్లో కొత్త మెరుపుతో ఆమె— ఆమె ప్రక్కన రిజల్ట్ కొరకు ఎదురు చూస్తున్న కాలేజీ అబ్బాయి విరించి.

"నువ్వన్నది నాకర్థం కాలేదు హారిణీ!"

"ఇందులో అర్థం కాకపోవడాని కేముంది విరించీ!"

చేతిలోని ఆకుపచ్చ మెటల్ గాజులను 'అటూఇటూ కదిలిస్తూ మరలా అంది హారిణి.

"ప్రేమించానని నేను చెప్పిన మరు క్షణంలో మన పెళ్ళి ప్రసక్తి మనిద్దరి మధ్య వస్తుంది. మనది ఒకే కులం కాదు. మా అమ్మ వాళ్ళు, మీ వాళ్ళు అంగీకరిస్తారో లేదో తెలియదు. ఒక ప్రేమ కొరకు మరో ప్రేమను పోగొట్టు కోవడం నాకిష్టం లేదు. ఏ ప్రేమయినా అది ప్రేమే. మన తల్లి దండ్రులు మనల్ని ఇరవై ఏళ్ళుగా ప్రేమిస్తున్నారు విరించీ. వాళ్ళదీ చిన్న ప్రేమ కాదు."

ఆశ్చర్యంగా విస్ఫారిత నేత్రాలతో చూసాడు విరించి.

"నీ వయసిప్పుడు పంథై తొమ్మిదికాదు, ఏభై తొమ్మిది."

"ఎందుకట?"

"నీలో తల్లిని చూసాను."

అర్థం కాలేదు హారిణికి.

"హారిణీ! నువ్వు నన్ను అర్థం చేసుకున్నావు. నిన్ను నేను అర్థం చేసుకున్నాను. ఇక నిన్ను నువ్వు కాపాడుకోనక్కరలేదు హారిణీ. నేను నిన్ను కాపాడుతాను. నిన్ను నాదానిగా చేసుకోడానికి నీ వాళ్ళ కాళ్ళు పట్టుకుంటాను. వాళ్ళు కరగని రోజు నిన్ను వాళ్ళకే వదిలేస్తాను. నీ మన శ్శాంతిని నేను దోచుకోను.

హారీ ఇప్పుడైనా ప్రేమించానని చెప్తావా?" ఆమె గడ్డం పైకెత్తి విజయ గర్వంతో ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు విరించి. ఫైనలియర్‌తో పాటు హారిణి అమ్మా నాన్నలు పెట్టిన సవాలక్ష పరీక్షలు పాసైన రోజు.

"ఉహూ తల అడ్డంగా వూపింది హారిణి. ఆమె కళ్ళు చలిస్తున్నాయి. ఆమె గుండె చలిస్తోంది కానీ ఆమె మనస్సు చలించలేదు.

హతవిధీ! ఇంకా ఏదైనా పరీక్ష మిగిలిపోయిందా?

"ఊ" ఆమె కట్టుకున్న తెలుపు మైసూర్ శిల్క్ శారీ గాలికి రెపరెపలాడింది. ఆమె తల కదిలికకు ఆమె పెట్టుకున్న నీలాల జుమికీలు గలగలలాడాయి.

"ఏమిటో ఆ పరీక్ష."

'మన పెళ్ళి."

"పెళ్ళికి పర్మిషన్ వచ్చింది తల్లీ."

"పర్మిషనే కదా! పెళ్ళి కాలేదు కదా!"

అతను తల పట్టుకుని కూర్చున్నాడు.

"అరవై తొమ్మిదేళ్ళ అమ్మమ్మా! నాకు నీదే దిగులు. నా పిల్లల గురించి దిగులే లేదు.

"ఆదేం?" చిలిపిగా చూసింది హారి.

"పిల్లలు నీ చేతుల్లో గదా పెరిగేది"

"ఇది కామెంటా? కాంప్లిమెంటా?"

"హండ్రండ్ పర్సెంట్ కాంప్లిమెంటే."

"నాకిది నీ దగ్గర మంచి అందిన గోల్డ్ మెడల్. అన్నట్టు మర్చిపోయాను, నీకు గోల్డ్ మెడల్ వచ్చింది కదా! నీకేం కావాలో చెప్పు."

"ఐదేళ్ళు కష్టపడి నీదగ్గర సంపాయించుకున్న గోల్డ్ మెడల్‌లాటి మంచి పేరు ముందు ఈ గోల్డ్ మెడల్ ఎంతగానీ! మాట తప్పవు కదా? ఏ దడిగినా ఇస్తావుగదా!

"మాట తప్పడం మా వంశంలోనూ లేదు, నేను వెళ్ళబోయే వంశంలోనూ లేదు. రస గుల్లా, గులాబ్ జామ్, హేమమాలిని, చంపాకలీ— అదిగో కన్పిస్తున్న ఆ స్వీట్ స్టాల్‌లో నువ్వేది కోరినా ఇచ్చేస్తాను. మాట తప్పనే తప్పను."

"నాకు తెలుసు. నాకు బాగా తెలుసు— ఇలాంటి ఫిట్టింగ్ ఏదో వేస్తావు నువ్వు నాకు హేమమాలిని, చంపాకలీలు వద్దు గానీ నాకు హారిణి కావాలి, ఆమెతో పెళ్ళి కావాలి"

హారిణి సిగ్గు పడింది — తల వంచుకుంది ఆమె చెంపల్లో సూర్యుడస్తమించాడు. ●